క్లుప్తంగా

ముత్యాల పోచమ్మ ఆలయానికి రూ. లక్ష విరాళం



చెక్కు అందజేస్తున్న శశాంక్

మల్యాల: మండల కేంద్రంలోని కొత్తపేటలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి మండల కేంద్రానికి చెందిన ఒడ్డెపల్లి శశాంక్ రూ.1,00,116 విరాళం అందజేశారు. కొత్తపేట పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఒడ్డెపల్లి శశాంక్, తల్లి ఒడ్డెపల్లి అనురాధ జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు.

మార్కండేయ ఆలయ నిర్మాణానికి..

మల్యాల: మండలంలోని మ్యాడంపల్లిలో నిర్మిస్తున్న మార్కండేయ ఆలయ నిర్మాణానికి మల్యాల మండలం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ రూ.10,116, రాష్ట్ర కమిటీ సభ్యులు బోగ వేంకటేశ్వర్లు రూ.11,000 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆదివారం మ్యాడంపల్లిలో జరిగిన సమావేశంలో విరాళాలు అందజేశారు. మార్కండేయ ఆలయ నిర్మాణానికి మరిన్ని సేవలందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, తుమ్మ రాజేశ్వర్, పెంట సుధాకర్, మ్యాడంపల్లి గ్రామ అధ్యక్షుడు అల్లె రాజయ్య పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గీతకార్మికులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సర్వాయి పాపన్న విగ్రహ పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. సర్వాయి పాపన్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, సర్పంచ్ లింగంపెల్లి గంగాధర్, గీత కార్మికసంఘం మండలాధ్యక్షుడు నేరెళ్ల సుభాష్ గౌడ్, దేవారెడ్డి, పుప్పాల నర్సయ్య, అశోక్‌గౌడ్, చిన్నమల్లయ్య పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామివారికి ఆభరణాలు బహూకరణ



దాతలు బహూకరించిన ఇత్తడి కవచం

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామివారికి ఆదివారం బీర్‌పూర్ గ్రామానికి చెందిన ముప్పాల సాగర్‌రావు–సులోచనదేవి దంపతులు స్వామివారి ఉదరంపై అలంకరించడానికి రూ. 70 వేలు విలువ చేసే ఇత్తడి కవచం (తొడుగు)ను బహూకరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు వీటిని స్వామివారికి ధరింపజేశారు. ఈ సందర్భంగా సాగర్‌రావు, సులోచన దంపతులను ఆలయ అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోషాచార్యులు, చిన్న సంతోషాచార్యులు, మధుకుమారాచార్యులు సన్మానించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

రాయికల్: మండలంలోని రామాజీపేటలో కనికరపు వనిత భర్త స్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద మహిళ కుటుంబానికి ఆదివారం రాయికల్‌లోని ఇన్నోవేటర్స్ సభ్యులు స్పందించి పదివేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కాశిరెడ్డి మారుతిరెడ్డి, సభ్యులు ,దాసరిరఘు, సంజీవరెడ్డి, అవినాష్, మహర్షి, రఘు, రూపేశ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీరేదెప్పుడో?

- సరఫరా కాని మిషన్ భగీరథ నీరు
- ఇబ్బంది పడుతున్న పట్టణ వాసులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నీటి కోసం బారులు తీరిన కాలనీవాసులు



నీటికోసం ఇళ్ల ముందు ఉంచిన డ్రమ్ములు

రాయికల్: ఎండకాలంలో రోజురోజుకు ఎండలు పెరిగిపోతుండడంతో రాయికల్ పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా పెరిగింది. పట్టణంలోని పలు కాలనీల్లో నీటి ఎద్దడి ఉంది. ముఖ్యంగా పట్టణంలోని 9వ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ కాలనీలో 300 గృహాలున్నాయి. ఇందులో 130 మున్సిపల్ నల్లాలు ఉండగా సుమారు 90 నల్లాలు పనిచేయడం లేదు. ఈ కాలనీలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బోరు, బావుల్లో ఉన్న నీరు ఎండిపోవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ప్రతీ ఇంటి వద్ద డ్రమ్ములు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని నాగారంవాడ, సింగనిరాందాస్ ఏరియా, ఎగ్గర్ల గంగరాజం, కైరంస్వామి, అల్లె ఆంజనేయులు ఏరియాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తాగునీరు కొనుక్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎన్నోసార్లు మున్సిపల్ కమిషనర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం



మా కాలనీలో తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో పాటు మున్సిపల్ నల్లాలు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న బోర్లలో నీరు ఎండిపోవడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నాం. మా నీటి గోస ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. – రాచకొండ రాజుబాయి, రాయికల్

మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మా కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులు, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కరించడం లేదు. వారానికి 2–3 సార్లు మాత్రమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజు సరఫరా చేయాలి.
– శ్రీరాముల సువర్ణ, కౌన్సిలర్

ట్యాంకర్లతో సరఫరా చేస్తాం



పట్టణంలోని 9వ వార్డులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతానికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రతిరోజు సరఫరా చేసేలా చర్యలు చేపడతాం. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.
– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

చిత్ర కథ: పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



కథలాపూర్ మండలంలోని పోసానిపేట, దుంపేట గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పచ్చని చెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటితే అవి పెరిగి పచ్చని చెట్లుగా ఎదిగాయని సంతోషపడ్డామని ప్రజలు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పచ్చని చెట్లను నరికివేయడం బాధాకరమని అంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో జనార్దన్ వివరణ ఇస్తూ... చెట్లను నరికేసిన ఘటనపై జిల్లా అటవీశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లామన్నారు. - కథలాపూర్

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి



మెట్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న సుజిత్‌రావు

ధర్మపురి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజేశ్ అన్నారు. పట్టణంలోని నంది కూడలి వద్ద ఆదివారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.కార్యక్రమంలో నాయకులు సింహరాజు ప్రసాద్, రాందేని మొగిలి, గణేశ్, షబ్బీర్, శరత్ తదితరులున్నారు.

పెగడపల్లి: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ అమలు చేసిన సంక్షేమ ఫథకాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేశాయని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచులు శంకర్, మహేందర్‌రెడ్డి, నాయకులు విజయభాస్కర్, తిరుపతి, సతీశ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి,మల్లేశం,పురుషోత్తం,పాల్గొన్నారు.

మెట్‌పల్లి: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావుతో పాటు పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కథలాపూర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. దేశానికి రాజీవ్‌గాంధీ అందించిన సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్, మండలోజి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు



రెతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బందిపెడితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని శుద్ధి చేసి, వ్యవసాయ అధికారి ధృవీకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని అన్నారు. పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్ల పూర్తికావాలన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా మూడురెట్ల వరిసాగు విస్తరణ పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, సింగిల్ విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, నాయకులు బాలముకుందం, ఆనందరావు పాల్గొన్నారు.

రామాజీపేటలో మీరు– నేను

రాయికల్: ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీరు– నేను కార్యక్రమం రూపొందించినట్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. మండలం రామాజీపేటలో ఆదివారం రాత్రి మీరు నేను కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని పలు వార్డులను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రామాజీపేట లో రూ.68 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి రమాదేవి, ఉపసర్పంచ్ హరీశ్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎమ్మార్‌ఎఫ్ చెక్కు అందజేత

కథలాపూర్: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాగుట్ల రాజ్యలక్ష్మికి రూ. 75,500 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా, ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందించారు. బాధితురాలు వైద్యఖర్చుల కోసం ఆర్థికసాయం దరఖాస్తు చేసుకోగా, ఎమ్మెల్యే సహకారంతో చెక్కు మంజూరైందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అభిలాశ్, నాయకులు అంకం సాగర్, పురుషోత్తంరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలకు సహకారం

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారమందిస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో ఆదివారం జరిగిన క్లబ్ 14వ చార్టెడ్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. మెట్‌పల్లి లయన్స్ క్లబ్ పేదల కోసం విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ క్లబ్‌లో తాను సభ్యుడినైనందుకు ఎంతో గర్వ పడుతున్నానన్నారు. రేకుర్తి కంటి ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల మధ్య స్థలం ఇస్తే అందులో లయన్స్ ఐ ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు. దీనికి ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కట్కం రాకేశ్, ఇల్లెందుల శ్రీనివాస్, ఇందూరి రాకేశ్, కోట గంగాజీవన్, వడ్డెపల్లి శ్రీనివాస్, మహాజన్ నర్సింహులు, పోహార్ తుక్కారాం, ఉషాకిరణ్ తదితరులున్నారు.

లక్ష్మీపూర్ రైతు సహకార సంఘం కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్ రైతు పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్షుడిగా పన్నాల తిరుపతిరెడ్డి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గర్వందుల చిన్న గంగయ్య, గడ్డం లింగారెడ్డి, గడ్డం రాజిరెడ్డి, క్యాతం గంగారెడ్డి, పన్నాల వెంకటరెడ్డి, నలువాల పోశయ్య, తిరుపతి, మనోహర్‌రెడ్డి, కుమార్, రాజేశ్వర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం కోసమే శిబిరాలు



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

కథలాపూర్: గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్‌కు చెందిన చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలకు సేవ చేసేవారిని స్వాగతించాలన్నారు. ప్రజలకు సేవ చేయడం తాము అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామంలో ఇంటింటా వైద్యసిబ్బంది తిరిగి 2,351 మందికి పరీక్షలు చేశారన్నారు. 500 మందికి చికిత్సలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 50 మందికి మెరుగైన వైద్యం అవసరమని, వీరికి ఉచితంగా వైద్యం అందించేందుకు కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర నాయకులు అనూప్‌రావు, సర్పంచ్ గడీల గంగప్రసాద్, ఎంపీటీసీ బాదినేని రమేశ్, వేములవాడ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, నాయకులు మహేందర్, దొప్పల జలందర్, పోతు శేఖర్, చెక్కపెల్లి రాజుకుమార్, మామిడిపెల్లి రవి, జవ్వాజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లోపే టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి

మల్లాపూర్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, సాధారణ బదిలీలను ప్రభుత్వం వేసవి సెలవుల్లోపే చేపట్టాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) మండల అధ్యక్షుడు ఎగ్యారపు వెంకటేశ్ అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్, స్కావెంజర్, సర్వీస్ పర్సన్లను నియమించాలని ప్రభుత్వానికి సూచించారు. డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేయడమే లక్ష్యంగా అవిశ్రాంత పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మత్స్యకార సొసైటీ చైర్మన్ పదవి గంగపుత్రులకే ఇవ్వాలి

కథలాపూర్: మత్స్యకార సొసైటీ రాష్ట్ర చైర్మన్ పదవి గంగపుత్రులకే ఇవ్వాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కల్లెడ గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కథలాపూర్‌లో గంగపుత్ర సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో మత్స్యకార సొసైటీ పదవి గంగపుత్రులకు ఇచ్చారని, ప్రత్యేక రాష్ట్రంలో గంగపుత్రులకు ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. గంగపుత్రులకు అన్యాయం చేయాలని చూస్తే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గంగారాం, శేఖర్, గంగాధర్, ప్రమోద్, నర్సయ్య, రాహుల్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోరుట్లటౌన్: హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపెల్లి వినోద్‌కుమార్ నివాసంలో విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించినట్లు జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్కాకుల సద్గురు తెలిపారు. విశ్వ బ్రాహ్మణులకు ప్రభుత్వం రూ. 1 లక్ష పథకం అమలు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల హనుమాండ్లు, టి. హనుమాండ్లు, బి.లక్ష్మణ్, భాస్కర చారీ ఎల్.వినయ్, జలంధర్, ఎల్.శ్రీనివాస్, ఆర్. శ్రీనివాస్, సురేశ్, సంఘ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబానికి చేయూత

కోరుట్లటౌన్: పట్టణానికి చెందిన పాత్రికేయుడు మహమ్మద్ నజీరుద్దీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు హెచ్ 143 జగిత్యాల జిల్లా ప్రతినిధులు ఆదివారం నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. నజీరుద్దీన్ కుటుంబ సభ్యులను తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు హెచ్ 143 జగిత్యాల జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, మెట్‌పెల్లి పాత్రికేయులు సాబీర్ అలీ, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయులు ముబీన్, సాజిద్ అలీ, అనాస్, అజీమ్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయాలి

రాయికల్: ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీకి నిరసనగా సోమవారం నిర్వహించనున్న జిల్లా బంద్ కు ప్రతి ఒక్కరూ సహకరించాలని రైతు ఐక్యవేదిక నాయకులు క్యాతం సాయిరెడ్డి, మొక్కొండ రాంరెడ్డి, చింతలపెల్లి గంగారెడ్డి, బందెల మల్లయ్య, వేముల కరుణాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపారులు,అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయి కార్టూన్ పోటీల్లో శంకర్‌కు బహుమతి

కోరుట్లటౌన్: కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన డి. శంకర్ రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీల్లో తృతీయ బహుమతి అందుకున్నారు. తొలి తెలుగు వంగ్య చిత్రకారుడు తెలిశెట్టి రామారావు జయంతి పురస్కరించుకుని తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా హాస్యనందం మాస పత్రిక ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీ–2023 నిర్వహించింది. రెండు రాష్ట్రాల నుంచి 4 వందల కార్టూన్‌లు రాగా 5 కార్టూన్‌లు ఎంపికయ్యాయి. శంకర్ గీసిన కార్టూన్‌కి 3వ బహుమతి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు కె.వి.రమణాచారీ, హాస్య నటుడు ఎల్.బి. శ్రీరాం చేతులమీదుగా శంకర్ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఏడుమోటలపల్లిలో పోచమ్మ బోనాల్లో పాల్గొన్న మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పద్మశాలీకి చెందిన మహిళలు పోచమ్మ బోనాల పండగ ఘనంగా జరుపుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో సర్పంచ్ శోభారాణి, ఎంపీటీసీ అనసూర్య, పద్మశాలి సేవాసంఘం నాయకులు జంజురు రాయమల్లు, పెంట మల్లేశం, కముటం కొమురయ్య, పెంట నరేందర్,లక్ష్మీరాజం, ఒల్లాల వెంకటేశ్, కులపెద్దలు పాల్గొన్నారు. మండలంలోని ఏడుమోటలపల్లిలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి, అమ్మ వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మన్‌కుమార్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, సర్పంచ్ రవినాయక్, ఎంపీటీసీ అంజయ్య, నాయకులు పాల్గొన్నారు.